

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవాసమితి ప్రచురణ)

సంపుటి : 15 ఫిబ్రవరి, 2019 సంచిక : 9

**సంస్థాపకులు :**

**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**

**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**

**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**

**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**

**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D

**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**సాయివాణి చందా వివరాలు**

వార్షిక చందా ... రూ॥ 100/-

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-

ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**

**సాయివాణి**

C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**

సాయిధామం, రామలింగంపల్లి(పోస్టు),

బొమ్మల రామవరం మండలం,

యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.

**Ph : 9440413455, 9848133565**

**విషయసూచిక** **పుట సంఖ్య**

మా వాణి .............................. 2

మువ్వల మురళి .............................. 6

సాయి సేవక్-శ్రీ శివనేశన్ .......... 11

జనాబాయి .............................. 15

పరమాత్మ దివ్యనామం .................. 19

సన్న్యాసం సమున్నతం .................. 21

మాతృసంస్థ కబుర్లు ...................... 26

స్వరాంజలి .............................. 31

ప్రశాంతి .............................. 32







## మా వాణి



### సాయి - శివుడు

సమర్థ సద్గురు సాయినాథులకు జయమగు గాక!

సాయీ మిత్రులారా!

త్వరలో రానున్న పర్వదినం శివరాత్రి - ఆనాడు పగలంతా ఉపవసించటం, రాత్రంతా జాగరణ చేయటం భారతీయులందరికీ అనూచానంగా వస్తున్న ఆచారం. అసలిలా ఎందుకు చెయ్యాలీ అంటే - ఆవేళ పరమశివుడు లింగ రూపంలో ఆవిర్భవించిన రోజు అని చెప్తారు పెద్దలు. అసలు శివతత్త్వమే చిత్రమైనది.

'శివం' అంటేనే శుభం. ఆ స్వామి శివంకరుడు. భస్మాసురుడు, గజాసురుడు, బాణాసురులవంటి రాక్షసులకు కూడా వరాలిచ్చేసేంత భోళా శంకరుడాయన. క్షీరసాగర మథనం జరుగోతంది. తొలుదొల్తగా హాలాహలం ఉద్భవించింది. ఆ ఘోర విషజ్వాలలకు ఈరేడు లోకాలూ అల్లాడిపోతున్నాయి. దేవతలూ, రాక్షసులూ పరమశివుని శరణువేడారు. 'సర్వమంగళ తన మాంగళ్యంబు మదినెంత నమ్మినదో'గానీ భర్త త్రాగబోతున్నది విషమని తెలిసి కూడా లోక క్షేమం కోసం గదా అని త్రాగమన్నదట. శంకరుడు ఆ హాలాహలమంతటినీ అరచేతిలోకి నేరేడు పండులాగా తీసుకుని అహరించేసాడు. మరి అది కాస్తా కడుపులోకి జారిపోతే ఎలా? ఉదరంబు లోపలి జగములన్నీ భస్మం కావా? అంచేత ఆ ఘోర కాకోల విషాన్ని కంఠసీమలోనే ఆపివేసాడు. ఆ వేడిమికి కంఠం

నలుపుకు తిరగ్గా "కాలకంఠుడు" అని పేరందాడు. అదీ శివతత్త్వం. దీనులై ఆర్తులైన వారెవరి కోసమైనా, ఎంతటి బాధనైనా భరించి వారిని ఆదుకోవడానికి సిద్ధపడే త్యాగశీలతే శివతత్త్వం అని స్పష్టమవుతోంది గదా!

ముజ్జగాలలోనూ 'సర్వజ్ఞుడన్న పేరున్నది. ఒక పరమేశ్వరునికే. ప్రతి మనిషికీ మూడవ కన్నుంటుందీ, కానీ అజ్ఞానపు పొర కమ్మి, అది మూసుకుని పోయి ఉంటుంది. శివునికి మాత్రం ఆ కన్ను జ్ఞానదీప్తులు చిమ్ముతూ వికసించింది అజ్ఞానం, అధర్మం, మూర్ఖత్వం పెచ్చు పెరినప్పడల్లా ఆ మూడవకన్నే విప్పి, తన జ్ఞానశక్తితో ఆయా దుష్టత్వాలన్నిటినీ భస్మం చేస్తాడాయన.

పరిశీలించి చూస్తే పరమేశ్వరునికీ మన సచ్చిదానందులు శ్రీ సాయినాథుని అవతారానికీ చాలా దగ్గర పోలికలు కన్పిస్తాయి. నిరంతరం స్మశానాలలో తిరుగుతూ బూది పూసుకుని కన్పిస్తాడు శివుడు. నిరంతరందుని వెలిగిస్తూ ఆ బూడిదనే విభూతిగా భక్తులకు పంచుతుండే వారు బాబా. తాను స్వయంగా అష్టైశ్వర్య ప్రదాతయై కూడా భిక్షమెత్తి జీవిస్తాడు పరమశివుడు. స్వయంగా వందేసి మందికి వండి వడ్డించే వారు సాయిబాబా. ప్రతిరోజు వందలాది రూపాయలు దక్షిణగా స్వీకరించి తిరిగి మొత్తం దానాలు చేసేస్తూ ఉండేవారు. అయినా తాను మాత్రం నిత్యం భిక్ష అడిగి తెచ్చుకొని తినేవారు.

పరమేశ్వరుడు దయా సింధువు. తనను కరుణార్ద్రంగా ప్రార్థించిన వారెవరినీ ఆయన వదలడు. అయినా క్రోధం ప్రదర్శిస్తూ రుద్రుడన్న పేరు తెచ్చుకున్నాడు. సాయిబాబా కూడా అలాగే పరమ కరుణాళువు. అయినా అప్పడప్పడూ విపరీతమైన క్రోధాన్ని ప్రదర్శిస్తూ, తన భక్తులకు కలుగబోయే కీడును పారద్రోలుతూ ఉండేవారు. బాబా ఊరి బయట పాడుబడిన





మసీదులో ఉండేవారు. ఇది పరమశివుని స్మశాన నివాసాన్ని గుర్తు చేస్తుంది.

సాయిబాబా కాళ్లకు మువ్వలు కట్టుకొని పాడుతూ సొంపుగా నాట్యం చేసేవాడని సాయీ సచ్చరిత్ర చెపుతున్నది. నటరాజ స్వామిలోని చిన్న అంశాత్మకమైన అభిరుచే దీనికి కారణమై ఉండవచ్చుననిపిస్తుంది. సచ్ఛరిత్రలో మనకు కన్పించే మేఘశ్యాముడు శివభక్తుడు. ఆయన శ్రీ సాయిబాబానే తన శివుడిగా భావించి సేవించేవాడు. బాబాకు ఆయన గంగనీటితో అభిషేకం చేసాడు. బాబా ఆయనకు శివరూపంలో దర్శనమిచ్చారు. ఇలా పరిశీలిస్తూ పోతే త్యాగశీలం, ధీరత్వం, కరుణ, అప్పటప్పటా పొంగే కోపం, నిరాడంబరత, ఐశ్వర్యప్రచాయక శక్తి, విభూతి దానం, నాట్యాభిమానం. ఇలా ఎన్నో పోలికలు శివ స్వామికి, శ్రీ సాయికీ కనిపిస్తాయి. అందుచేత మనకు శ్రీ సాయినాథులే సాక్షాత్ శివమూర్తి.

ఇక - శివరాత్రి నడిచే విధానం గూర్చి కాస్త చూద్దాం. పగలంతా ఉపవాసం ఉంటాం. ఉప అంటే సమీపం. భగవంతుని సామీప్యంలోకి వెళ్ళి, అక్కడ నిలవగలగటమే ఉపవాసం. అలా భగవచ్చింతనలోనే స్థిరంగా నిలచిపోయిన భక్తునికి ఆకలి దప్పలు తెలియవు. ఆ భగవన్నామపు చవీ, ఆ రూప మాధుర్యం ఆ కథామృతపు అమోఘపు రుచీ తప్ప అతనికింకేవీ రుచింపవు. అందుచేత అతడేమీ తినడు. ఇది ప్రగాఢ భక్తి గలవారి సంగతి. ఇక మామూలు భక్తి శ్రద్ధలు గలవారు పూర్తి ఆహారం తీసుకొని భగవద్ధ్యానం చేద్దామని కూర్చుంటే తామసలక్షణమైన నిద్ర ఆవహిస్తుంది. బద్ధకం వర్తిస్తుంది. అంచేత శరీరాన్ని తేలికగా ఉంచుకోవటం కోసం ఆహారం తగ్గించుకోవాలి. అలా భోజనం మానివేసినంత మాత్రాన చాలదు. దాన్ని గురించి స్మరించకుండా ఉండాలి. ఇవ్వాళ ఉపవాసం ఉన్నాను, నీరసంగా ఉంది. ఇలాంటి భావన వస్తే మరి ఆ ఉపవాసానికి ఫలం

లేనట్లే. అలాటి నీరసాలు రాకుండా ఉండటం కోసం తేలికగా పళ్లో పాలో తీసుకోవాలంటారు. తిండి సంగతి ఎలా ఉన్నా మనసు మాత్రం స్వామి మీదనే లయించి ఉండాలి. అప్పుడే అది నిజమైన ఉపవాసం అవుతుంది.

రాత్రంతా జాగరణ చేస్తాం. తెల్లవార్లూ మెలకువగా ఉండి, మనస్సునీ, బుద్ధినీ, చిత్తాన్నీ మేలుకొలిపి స్వామి మీద స్థిరంగా నిలిపే ప్రయత్నమేయిది నిత్య జీవితపు ఒత్తిడులలో, ఊపిరి సలపని దినచర్యలలో భగవత్కథా శ్రవణానికిగానీ, సంస్మరణానికిగానీ అవకాశం లభించటం కష్టం. అందుచేత-ఆ రాత్రి మొత్తం అందుకే ఉపయోగించాలి. పిల్లలు, పెద్దలు అంతా కలిసి కూర్చొని భజనలు చెయ్యవచ్చు, శివగాథలు వినవచ్చు, పిల్లలకు చెప్పవచ్చు. కీర్తనలు, పద్యాలు పాడుకోవచ్చు. చిన్న చిన్న క్విజ్‌ల వంటివి నడుపుకోవచ్చు. పురాణం, హరికథ - యిలా ఎన్నో రకాల సత్కాల క్షేపం చెయ్యవచ్చు. దానివలన నామస్మరణ పుణ్యం దక్కుతుంది. అయితే యీ మధ్యకాలంలో అలాటివేమీ కన్పించటం లేదు. టి.వి. ముందు కూర్చుని సినిమాలూ, నాట్యాలూ చూడటంతో సరిపోతున్నది. దీనిలో మనం పాల్గొనేదెక్కడ? మన పెదవి కదిపి 'శివ శివా' అనేదెక్కడ? కథలు చర్చించి నిగ్గుతేల్చి ఆ సారం మన సంతతికి అందించే దెక్కడ? ఇంకా సోఫిస్టికేటెడ్ ఇళ్లలో అయితే పిల్లలు వీడియోగేమ్స్ ఆడటం కన్పిస్తుంటే. పెద్దలు పేకాడటం కన్పిస్తుంది. అంటే వారి దృష్టిలో జాగరణ అంటే శరీరాన్ని మెలకువగా ఉంచితే చాలన్నమాట. అలా కాదు - మగత నిద్రలో ఉన్న మన మెదడునూ, బుద్ధినీ, లేపి శివార్పితం చేయటమే శివరాత్రి జాగరణ ప్రయోజనం.

సాయీ భక్తులమైన మనం పై విషయాలన్నిటినీ దృష్టిలో ఉంచుకొని యీ శివరాత్రిని నిజంగా స్వామి సన్నిధిన వసించడానికి, అజ్ఞానం అనే నిద్రను జయించడానికీ ఉపయోగిద్దాం.





బాలవాణి



# మువ్వల మురళి

- శుకవాణి

ఆ ఊరి పేరు గోపాలపురం. ఆ ఊళ్లో ఓ పేద తల్లి ఉంది. ఆమెకు ఒక్కడే కొడుకు మురళి. వాడికి నాన్న లేడు. ఆయన చచ్చిపోయాక తల్లి కామాక్షి ఆ ఇంట్లో యీ ఇంట్లో గిన్నెలు తోమీ, బట్టలుతుకీ, పిండి దంచీ, పచ్చళ్లు రుబ్బీ ఎలాగో బ్రతుకుతోంది. వాళ్లూవీళ్లూ యిచ్చిన అన్నమూ, కూరలూ ముందు మురళికి పెట్టి, మిగిలితే తను తింటుంది లేకపోతే కడుపునిండా మంచినీళ్లు తాగేసి పడుకుంటుంది. మురళి ఏడేళ్ల వయసే అయినా వాడికి తల్లి పడే కష్టాలన్నీ తెలుసు. అందుకనే వాళ్లమ్మని అది కావాలి, ఇది కావాలి అని ఎప్పుడూ వేధించడు. కామాక్షి ఆ ఊరి బడిలోని అయ్యవారిని (టీచరు) బ్రతిమాలి మురళిని బడిలో వేసింది. అయ్యవారు కూడా మురళిని ఎంతో ప్రేమగా చూస్తూ వాడి తెలివిని మెచ్చుకుంటూ పాఠాలు చెప్తారేగానీ జీతం తెమ్మని అడగరు.

ఇలా ఉండగా ఒకరోజు మురళి తమ చిన్న పూరింట్లో ఉన్న అటక పైకి ఎక్కి అక్కడున్న బట్టలూ, పాత పెట్టెలూ అన్నీ వెదకసాగాడు. వాడికేమీ తోచటం లేదు. ఇరుగుపొరుగు పిల్లలకు ఆడుకునేందుకు బంతులూ, చక్రాలూ, బండ్లూ యింకా ఎన్నో వస్తువులుంటాయి. తనకి కూడా ఏదైనా దొరుకుతుందేమోనని వాడు అటకెక్కి కూర్చున్నాడు. సరే- చివరికి వాడికొక వేణువు-అదే పిల్లనగ్రోవి దొరికింది. దానికి ఒక ప్రక్కన చిన్నచిన్న మువ్వలు కట్టి ఉన్నాయి. మురళి దాన్ని ఊదబోయాడు. ఊహుఃఁ సరిగ్గా రాలా. వాడె అటక దిగి అమ్మ దగ్గరకు పరుగెత్తాడు.

"అమ్మా! అమ్మా! దీన్ని ఊదవే!" అన్నాడు. కామాక్షికి దాన్ని చూస్తూనే కళ్లనిండా నీళ్లు వచ్చాయి. దాన్ని ఎంతో ఆప్యాయంగా చేతిలోకి తీసుకుని పైటచెంగుతో మెల్లగా తుడుస్తూ,

"దీన్ని ఊదటం నాకు రాదు నాన్నా! మీ నాన్నగారు ఇలాటి వేణువులే తయారుచేసి అమ్మేవారు. ఈ మువ్వల మురళి తన కోసమే చేసుకున్నారు. ఎంత బాగా వాయించేవారనీ! సాక్షాత్తూ ఆ కృష్ణుడే వచ్చి వాయిస్తున్నట్లుండేది" అన్నది.

"నాన్నగారు ఇప్పుడెక్కడున్నారే" అని అడిగాడు మురళి అమాయకంగా.

"కృష్ణుడి దగ్గరికి వెళ్లిపోయారు నాన్నా!" అంది కామాక్షి కన్నీళ్లు తుడుచుకుంటూ.

మురళికి అమ్మ దుఃఖం చూస్తే ఎంతో బాధ కలిగింది. ఆమెను ఎలా ఓదార్చాలో వాడికి తెలియలేదు.

"అమ్మా! నాకూ అప్పుడెప్పుడో కిష్టుడి కథ చెప్తానన్నావుగా-చెప్పవూ!" అన్నాడు అమ్మ ఒళ్లో సర్దుకొని కూర్చుంటూ.

కామాక్షి కొడుకు చెంప నిమిరి "అలాగే!" అంది. తల్లీ, కొడుకూ శ్రీకృష్ణుడి చిత్రవిచిత్రమైన లీలలన్నీ చెప్పుకున్నారు చాలాసేపు. చివరికి మురళి అడిగాడు. "అమ్మా! కృష్ణుడెక్కడుంటాడే" అని. వాడికర్థమయ్యేలా ఎలా చెప్పాలో కామాక్షికి తెలియలేదు.

"చాలా దూ........రంగా ఉంటాడు నాన్నా!" అంది.

అంటే అ.........క్కడ అడవిలోనా?" అడిగాడు మురళి.

"ఆఁ! అవును" అంది కామాక్షి.

"మరి మనం వెడితే కన్పిస్తాడా?" మురళి సందేహాలకు అంతం లేదు.

"ఆఁ! ఎందుకు కన్పించడూ! చక్కగా కన్పిస్తాడు" అంది తల్లి.

"మరి మనం పిలిస్తే పలుకుతాడా?"

"ఆ! నువ్వీ పిల్లనగ్రోవి చక్కగా ఊదటం నేర్చుకో. కృష్ణుకిదంటే చాలా ఇష్టం గదా! నువ్విది బాగా ఊదుతోంటే ఆ శబ్దం విని తనే నీ దగ్గరకు వస్తాడు - తనే పలకరిస్తాడు" అన్నది కామాక్షి, మురళి మళ్లీ ఏదో ప్రశ్న వెయ్యబోయాడు కానీ, "అమ్మో! పనికి వెళ్లే వేళైందిరా. మురళీ- లే లే!" అంటూ వాడిని వదిలేసి వెళ్లిపోయింది తల్లి.





ఆమె వెళ్లిపోయినా మురళి చెవుల్లో ఆమె మాటలు రింగుమంటూనే ఉన్నాయి. వాడు గట్టి నిర్ణయం చేసుకున్నాడు. తాను బ్రహ్మాండంగా వేణువు వాయించటం నేర్చుకోవాలి. చిన్నికిష్టుడు "అబ్బా! అనుకోవాలి అంతే! మురళి పిల్లనగ్రోవి నోటి దగ్గర పెట్టుకొని గాలి ఊదాడు. అది 'కీ'మని అరిచింది. మురళి మళ్లీ ఊదాడు. ఈసారి 'కికీ' అంది. మురళి మెల్లమెల్లగా తనకు చేతనైనట్లు ఊదుతూ కూర్చున్నాడు.

✡ ✡ ✡

కొద్దిరోజులు గడిచిపోయాయి. మురళి సాధన అలా సాగుతూనే ఉంది. అప్పుడప్పుడూ కామాక్షి వాడి మీద విసుక్కుంటూ ఉండేది - "ఎప్పుడు చూచినా ఆ పీపీ ఏమిటిరా ఏమీ దిద్దుకోకుండా, చదువుకో కుండానూ" అని. అప్పుడు మురళి లోపల్లోపలే అనుకొనేవాడు- "అలాగే అంటూ ఉండు. నేను బోలెడంత బాగా పిల్లనగ్రోవి వాయిస్తే పిలవగానే కిష్టుడొస్తాడుగా! అప్పుడు నీకే తెలుస్తుందిలే!" ఆ మధ్య నొకరోజు వాళ్ల బళ్లో అబ్బాయి శ్యామూ మురళి వేణువు ఊదటం విని మెచ్చుకున్నాడు. వాడిలాగే తనుకూడా ఊదబోయి చేతగాక చిన్నబుచ్చుకున్నాడు కూడా. అప్పటినుంచీ మురళిలో ఆత్మవిశ్వాసం పెరిగిపోయింది. ఇంకొద్దిరోజులి లాగే సాధన చేస్తే ఉంటే తను కూడా కిష్టుడంత బాగానూ వాయించ గలడు- అనుకున్నాడు వాడు.

ఇలా ఉండగా దసరా పండుగ దగ్గరకు వచ్చింది. రేపో ఎల్లుండో దసరా సెలవులిచ్చేస్తారు కూడాను. ఆరోజు అయ్యవారు పిల్లలందరినీ కూర్చోబెట్టి దసరా పద్యాలు నేర్పటం మొదలుపెట్టారు. పద్యాలు వచ్చాక

"ఒరేయ్ పిల్లలూ! ఎల్లుండి మనం మన బళ్లోనే సరస్వతీ పూజ చేసుకుందాం రా!" అన్నారు.

పిల్లలంతా ఎగిరి గంతేసారు. "అలాగే గురువుగారూ!" అని ఏక కంఠంతో అరిచారు. అయ్యవారు పూజకు ఎవరెవరు ఏం తేవాలో చెప్పారు, ఆయన్ను సరిగా చెప్పనివ్వకుండా "నేను మందారపూలు తెస్తానండీ!"

అని ఒకరూ "నేను పత్తి తెస్తాన"ని మరొకరూ, నేను పసుపూ కుంకుమా తెస్తాను గురువుగారూ!" అని ఇంకొకరూ అరవటం మొదలుపెట్టారు. దాంతో అయ్యవారు చికాకు పడి, అందర్నీ నోళ్లు మూసుకొని కూర్చోమన్నారు. తను చెప్పేది శ్రద్ధగా వినమన్నారు.

ఎల్లుండి పిల్లలందరికీ అయ్యవారితో సహా భోజనాలిక్కడే-బళ్లోనే. ఊరి బయటి పేదవాళ్లు యాభైమందిని కూడా పిలుస్తారు. వంట పనంతా ఆడపిల్లలు, గంటలు కొట్టే సుందరయ్యా, మాస్టారి భార్యా చూచుకుంటారు. నీళ్లు మొయ్యటం, వడ్డనా, విస్తర్లు తియ్యటం అంతా మగపిల్లల వంతు. ఇవన్నీ అయ్యవారు చెప్తుంటే మురళి ఎంతో ఉత్సాహంగా విన్నాడు. అయితే చివరగా అయ్యవారు చెప్పిన మాటలు వినగానే వాడికి నీరసం వచ్చేసింది. పిల్లలందరూ వంటకు కావలసిన సంబారాలు-అంటే బియ్యమూ, పప్పూ, ఉప్పు, చింతపండు వంటివన్నీ తలొకటీ తేవాలి. ఎవరెవరు ఏమేం తేవాలో కూడా అయ్యవారు చెప్పేసారు. అందులో శివాజీ దళం - అంటే మురళి వాళ్ల గ్రూపుకు పెరుగు, విస్తళ్లు తెచ్చే పని ఇచ్చారు. విస్తళ్లు సరే - బాదం ఆకులు, అరటి ఆకులు, మోదుగాకులు - అన్నీ కోస్తే సరి. బోలెడు విస్తళ్లవుతాయి. ఇకపోతే పెరుగు సంగతి. "తలొక శేరు పెరుగూ తేవాలిరా మనం" అన్నాడు శివాజీ దళం నాయకుడు (లీడరు) బాచీ, బాచీ పూర్తి పేరు భాస్కర్రావు. వాడికి తన దళం ఎందులోనూ వెనకపడకూడదని మహా పట్టుదల. అన్నట్లు అసలు 'దళం' అంటే ఏమిటో మీకు తెలిసిందా? మురళి వాళ్ల బళ్లో ఉన్న పిల్లలందరూ కలిసి వందమంది. అది చిన్న ఊరుగదా మరి! చిన్నపిల్లలు అంతే ఉన్నారన్న మాట. ఈ వందమందినీ అయ్యవారు పది దళాలుగా విడగొట్టారు. వాటికి రాణాప్రతాప్ దళం, శివాజీ దళం, వీరహనుమాన్ దళం, ధ్రువదళం, బాలచంద్ర దళం - యిలా తలొక పేరూ పెట్టారు. ఆడపిల్లల దళాలకైతే రుద్రమదేవి దళం, ఝాన్సీలక్ష్మీబాయి దళం, మాంచాల దళం, మీరా దళం - యిలాటి పేర్లున్నాయి. వాళ్ల బడి ఆవరణలో చక్కని తోట పెంచటం, ఆవరణంతా శుభ్రంగా ఊడ్చి నీళ్లు





చల్లి ముగ్గులు పెట్టటం, మధ్యాహ్నం పూట తాగటానికి కుండల్లో నీళ్లు నింపి పెట్టటం, గంటలు కొట్టటం, ప్రార్థనకు వరుసల్లో నిలుచోబెట్టటం-యిలా ఒక్కొక్క పని ఒక్కొక్క దళం వాళ్లు చేస్తారన్నమాట! అందుకే ఆ బడి ఎప్పుడూ శుభ్రంగా, అందంగా ఉంటుంది. పిల్లలు క్రమశిక్షణతో ఉంటారు. తోట పచ్చగా కళకళలాడుతూ ఉంటుంది. సరే-మన మురళి వాళ్ల శివాజీ దళానికి నాయకుడు బాచీ అనుకున్నాం గదా! వాడు మళ్లీ హెచ్చరించాడందరినీ. "ఒరేయ్! మనం వెనుక పడిపోకూడదురా! తలొక శేరూ అంటే పెద్దగిన్నెడు పెరుగు తేవాలి.  ఏం సరేనా!" అందరూ సరే సరేనని అరిచారు. మురళి ఏమీ మాట్లాడ లేదు. వాడికి లోలోపల చాలా బాధ కలిగింది. శేరు పెరుగు తనకెలా వస్తుంది! అసలు ఎప్పుడోగాని అమ్మ పెరుగు తీసుకురాదు. మిగిలిన వాళ్లందరికీ గేదెలూ, ఆవులూ ఉన్నాయి-వాళ్లు తెస్తారు. తనకెక్కడి నుంచీ వస్తుంది? అమ్మ నడిగితే బాధపడుతుంది తప్ప లాభం లేదు. మురళి పుస్తకాల సంచి భుజాన వేసుకొని మెల్లగా ఇంటి దారి పట్టాడు.

మర్నాడు సెలవురోజు. మురళి ఇంట్లోనే కూర్చున్నాడు. ప్రక్కింటి వాళ్లమ్మాయి లలిత వచ్చి ఆడుకుందాం రమ్మంది. అమ్మ కూడా 'వెళ్లరా' అంది. ఐనా మురళి కదల్లేదు. మునగదీసుకొని గోడకానుకుని అలాగే కూర్చున్నాడు. కాస్సేపయ్యాక వాళ్లమ్మకు అనుమానం వచ్చింది. వీడిలా ఉన్నాడేమిటా-అని. "ఏరా నాన్నా! ఒంట్లో బాగోలేదా? అలా ఉన్నావేం?" అని చెయ్యి పట్టుకొని చూచి, "జ్వరం అదీ లేదే!" అంది. మురళి మాట్లాడనే లేదు. కామాక్షి మెల్లగా నవ్వి, "ఏమిటి నాన్నా! అలిగావా!" అంది. వాడు తల అడ్డంగా ఊపాడు. "మరేమిటి సంగతి! అమ్మతో చెప్పవా?" అంది కామాక్షి వాడిని దగ్గరకు తీసుకుని. మురళి అమ్మ గుండెల్లో ముఖం దాచుకున్నాడు. ఏడుపొచ్చింది వాడికి. అయ్యవారి మాటలన్నీ అమ్మకు చెప్పాడు కళ్లు తుడుచుకొని.

**(పిల్లలూ, మిగతా కథ పైనెల చెప్తానేం!)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

(గత సంచిక తరువాయి)

స్వామీజీ పస్తులుండుట గమనించిన ఒక వ్యక్తి బీచ్ వద్ద ఒకతను రొట్టెలు పంచుతున్నాడని అక్కడకు వెళ్ళమని సలహానిచ్చెను. స్వామీజీ ఆ ప్రదేశానికి వెళ్ళగానే రొట్టెలు పంచే ఫ్రాన్సిస్ డేవిడ్ స్వామి ముఖమున గల విభూది రేఖలను గాంచి స్వామీజీ హిందువని గ్రహించి హిందువులను హిందూ మతమును కించపరుచుచు "పని చేసి సంపాదించుకోగల వయస్సులో ఎందుకు భిక్షమెత్తుతున్నావ?"ని హేళనగా ప్రశ్నించెను. అతని దూషణములను లెక్కచేయక "నేను భిక్షమెత్తుటకు రాలేదు. మీరు ఎందరికో రొట్టెలు దానము చేయుచున్నారని తెలిసి మీ వంటి దయార్ద్ర హృదయులు నాకేదైన పని చూపించగలరన్న ఆశతో మీ చెంతకు వచ్చితిని" అని అతి ప్రశాంతముగా సమాధానమిచ్చెను. వారి సంభాషణలో స్వామీజీ తమిళుడని గ్రహించిన డేవిడ్ తాను తంజావూరుకు చెందిన వాడినని హిందూ మతమును వీడి క్రిస్టియన్ మతము స్వీకరించినట్లు తెలిపెను. "సర్వమతములు సమానమే, కులమతములు మానవ కల్పితములే. భగవంతుని దృష్టిలో సర్వప్రాణులు సమానమే. అందరి దేముడు ఒక్కడే"నని స్వామి చెప్పగా అతను కూడా దానిని మనసారా అంగీకరించెను. ఆ క్షణము నుండి ఇరువురు ప్రాణస్నేహితులైరి. డేవిడ్ తాను వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న కంపెనీ యజమాని దగ్గరకు స్వామీజీని తీసుకువెళ్ళి ఏదైనా ఉద్యోగం ఇవ్వమని సిఫారసు చేయగా ఆ యజమాని స్వామీజీకి ఉద్యోగమివ్వ నిరాకరించెను. కంపెనీ అభివృద్ధిలో భాగంగా నూతన భవనాల నిర్మాణతను గాంచిన స్వామీజీ కనీసం కూలీపని అయినా ఇప్పించమని తన అసహాయస్థితి వివరించి ప్రాధేయపడినను





ఆ యజమాని మనస్సు కరుగలేదు.

డేవిడ్ తనకు పరిచయమున్న ఒక హోటల్ యజమానికి స్వామీజీ ఏదైనా పని ఇప్పించమని సిఫారసు ఉత్తరం వ్రాసి స్వామిని పంపగా అతను కూడా వ్యాపారం సరిగా జరగటం లేదని ఉద్యోగం ఇవ్వటం సాధ్యం కాదని చెప్పాడు. స్వామీజీ మంచి నైజాన్ని గుర్తించిన డేవిడ్ స్వామికి తన గదిలో ఆశ్రయం కల్పించాడు.

కష్టాలు కలకాలం ఉండవనే రీతిన స్వామీజీ కష్టాలు గట్టెక్కి "ప్రోగ్రసివ్ మెడికల్స్" అనే డి.డి.టి. తయారుచేసే కంపెనీలో తాత్కాలిక ఉద్యోగం లభించింది. ఆ కంపెనీలో స్వామీజీ సీసాలు కడిగి శుభ్రపరచుట, పార్సిళ్ళ మీద చిరునామాలు వ్రాయటం మొదలగు పనులు చేసేవారు. కొంత కాలం పని చేసిన తరువాత తాత్కాలిక ఉద్యోగం కావటంతో కంపెనీ యజమాని స్వామీజీని ఉద్యోగము నుంచి తొలగించాడు.

స్వామీజీ ప్రతి నిత్యం పేపరు చదివి అందులో ప్రకటించిన ఉద్యోగాల ఇంటర్వ్యూలకు హాజరయ్యేవారు. ఎటువంటి ఉద్యోగం చేయటానికైనా వెనుకంజ వేసేవారు కాదు. ఉద్యోగం ఉదర పోషణార్థమే గాని ఆ సంపాదనతో భోగభాగ్యాలనుభవించవలెనన్నది స్వామీజీ అభిలాష కాదు, అభిమతము కాదు.

ఇంటింటికి పాలు సరఫరా చేసే ఉద్యోగానికి ఇంటర్వ్యూకి వెళ్ళి ఇళ్ళ చిరునామాలు సరిగా తెలియని స్వామీజీ ఆ ఇంటర్వ్యూలో కృతార్థులు కాలేకపోయారు.

ఉద్యోగం లభించక తలదాచుకోవటానికి నీడ, తినటానికి తిండి లేకపోయినా దైవం మీద విశ్వాసం కించిత్తు కూడ సడలలేదు మన స్వామీజీకి. రొట్టె తిని టీ త్రాగి రోజులు గడిపేవారు. వాటికి కూడ డబ్బులు లేని రోజున నీళ్ళు త్రాగి కడుపు నింపుకున్న రోజులు మన స్వామీజీ జీవితంలో ఎన్నో ఉన్నాయి.

**గురుకృప :**

ఇటువంటి విపత్కర పరిస్థితులలో స్వామీజీకి ఒక గొప్ప దైవ భక్తుడు, శాస్త్రాల సారాన్ని ఔపోసన పట్టిన ఒక మహోన్నత వ్యక్తితో చిత్రంగా పరిచయమేర్పడింది. స్వామీజీ వారినే తన గురువుగా స్వీకరించి వారి నుంచి అనేక గ్రంథసారాలను గ్రోలి తన జీవిత గమ్యాన్ని భగవంతుని నిర్ణయానికే వదలి వేసారు. భక్తుని దగ్గరకు భగవంతుడు వచ్చిన రీతిగా మంచి శిష్యుల కోసం గురువే శిష్యుని దగ్గరకు వచ్చారు. మంచి శిష్యుని కోసం గురువే శిష్యుని వెతుక్కుంటూ వస్తారన్న నానుడి అక్షర సత్యమైనది మన స్వామీజీ విషయంలో. స్వామీజీ గురువు గారి నామధేయం శ్రీ ముత్తయ్యగారు. వీరి స్వగ్రామం మద్రాసు రాష్ట్రంలోని తిరునల్వేలి జిల్లా వల్లనాడు. ఒక పర్యాయం ముత్తయ్యగారు ఆధ్యాత్మిక పరమైన సందేహ నివృత్తి కోసం ఒక దేవాలయానికి వెళ్ళగా అక్కడ మన స్వామీజీ చేతిలోగల "జీవ బ్రహ్మైక్య వేదాంత రహస్యము" (Secrets of Vedantha) తమిళ గ్రంథాన్ని చూచి తనను తాను పరిచయము చేసుకొని ఆ గ్రంథాన్ని తెరచి చూడగ తన సందేహానికి సమాధానం ఆ పుటలోనే లభించింది. వీరిరువురి కలయిక ఎంత శుభసూచకమో కదా! రాను రాను వీరి పరిచయం వృద్ధి చెంది ముత్తయ్యగారి జ్ఞాన సంపన్నతకు అచ్చెరువొందిన స్వామీజీ వారినే తన గురువుగా స్వీకరించెను.

శ్రీ ముత్తయ్య గారి అతి నిరాడంబరత, విద్యా వివేకములున్నను అణుకువతో నుండుట, దైవ చింతన మన స్వామీజీ జీవితంపై ఎంతో ప్రభావితం చేసినవి. మన స్వామీజీ కూడ గురువుకు తగ్గ శిష్యుడై ఆయన అడుగు జాడలలోనే నడచి ఆయన వలెనే బ్రహ్మచర్యాన్ని పాటించి భగవంతుని సేవకే తన జీవితాన్నర్పించిన ధన్యజీవి.

శ్రీ ముత్తయ్యగారు బొంబాయిలో ఒక నూలు మిల్లులో పనిచేసేవారు. వీరు పగలంతా కష్టపడి పనిచేసి రాత్రి 11 గంటలకు ఇంటికి వచ్చి





వంట చేసుకుని భోజనం చేసి ఆ తరువాత తెల్లవారుజాము వరకు ధ్యానంలో గడిపేవారు. రోజులో రెండు లేక మూడు గంటలు మాత్రమే నిదురకు కేటాయించేవారు. గురువుగారి అడుగుజాడలలో నడచిన మన స్వామీజీ కూడ అతి స్వల్ప సమయాన్ని నిదురకు కేటాయించేవారు. తమ జీవితాంతం వరకు స్వామీజీ ఈ నియమాన్ని ఉల్లంఘించలేదు.

స్వామీజీ వారి గురువుగారింటికి ప్రథమంగా వెళ్ళినప్పుడు ఆయన నివసించే గది, ఆ పరిసర ప్రాంత వాతావరణం చూసి ఆశ్చర్యచకితు లయ్యారు. గదిలో రెండు, మూడు పాత్రలు కొద్దిగా వంట సామాను, రెండు జతల బట్టలు ఇవే ముత్తయ్యగారి ఆస్తి. ఆ పరిసర ప్రాంతమంతా చెత్తాచెదారంతోటి, మురికినీటితోను, కడు బీద వారు నివసించే కాలనీ అది. అందు నివసించే వారంతా పగలంతా కష్టించి పనిచేసి ఆ అలసటను మర్చిపోవటానికి తప్ప త్రాగి సాయంకాలానికి గూటికి చేరే అభాగ్యులు. ముత్తయ్యగారు అటువంటి మురికివాడలో నివసిస్తున్నా ధ్యానానికిగానీ, వారి నిత్యకృత్యాలకు ఆ కలుషిత వాతావరణం ఆటంకం కాలేదు. అటువంటి ప్రదేశంలో నివసిస్తూ ధ్యానం ఎలా కొనసాగిస్తున్నారన్న మన స్వామీజీ ప్రశ్నకు ముత్తయ్యగారి సమాధానం నేటి తరం వారికి కనువిప్పు కాగలదు. ముత్తయ్యగారు తాను ఇంటికి చేరుకునే సరికి రాత్రి 11 గంటలు అవు తుందనీ, అప్పటికి త్రాగుబోతుల హడావిడి సద్దుమణుగుతుందనీ, మనస్సు నాధీనంలో నుంచుకుని ధ్యానస్థులైతే నెత్తిన పిడుగుపడినా చలించకూడ దనియు, అట్టి ఏకాగ్రత అవసరమని సెలవిచ్చారు. ఆ చుట్టు ప్రక్కల చెత్తాచెదారం గురించి వివరిస్తూ "మురికి ఎక్కడ లేదు? మన శరీరంలో సహితం మలమూత్రాదులు, రక్త మాంసాలున్నాయి వాటిని మనం శుభ్రం చేయగలమా?" అని ఎదురు ప్రశ్నించి మనస్సు మలినం కాకుండా కాపాడుకోవాలి అదే జీవిత పరమావధని వచించారు. ఈ ఉపదేశమే స్వామీజీకి తారకమంత్రం వలె పనిచేసి ఆయన జీవితాన్ని పరమార్థం వైపు పయనింపజేసింది.

**(సశేషం)**



## భక్త కథాసుధ

# జనాబాయి

- ప్రభుజీ

పూర్వజన్మ సుకృతం వలన భక్తి, అనన్య భక్తి వలన మోక్ష సామ్రాజ్యము లభిస్తుంది. ఇహలోక సంబంధాలు భక్తి మార్గానికి ఆటంకాలు. భక్తి పెరుగుతున్న కొద్దీ లౌకిక విషయాల మీద ప్రేమ తగ్గుతూ తగ్గుతూ చివరకు ఆ ఆరాధ్యదైవం తప్ప మిగిలినవన్నీ ఎంతో తుచ్ఛమైనవిగా కన్పిస్తవి. ఈ జన్మకు సంబంధించిన తల్లీ దండ్రులుకానీ, భార్యాభర్తలుకానీ, సంతానం కానీ, సంపదలు కానీ చివరకు సమాజంలో తనకు లభించిన గౌరవాదరాలు కానీ తాను ఎన్నుకున్న మార్గానికి అవరోధాలుగానే గ్రహించి భక్తుడు క్రమేణా వాటినన్నిటినీ వదలి ఆ పరమేశ్వరుని దివ్య పాదారవిందాలనే ఆశ్రయించి మోక్ష సామ్రాజ్యాన్ని పొందగలుగుతాడు. దీనికి పాండిత్యంతో పని లేదు. ఉన్నత కుటుంబంలో పుట్టనక్కరలేదు, సిరిసంపదలు అసలే అవసరం లేదు. కావలసినదల్లా స్వచ్ఛమైన హృదయమూ, ఆరాధ్యదైవం పట్ల అచంచలమైన ప్రేమా. దీని కోసం వయస్సు మళ్ళేదాకా ఆగవలసిన పని లేదు. ఆ పాండురంగని కరుణ ఎప్పుడు మన మీద ప్రసరిస్తుందో అప్పుడే, ఆ క్షణమే లోకాన్ని మరచిపోతాము. ఆ గమ్యం తప్ప మరేదీ యిక కన్పించదు.

ఆ బాలిక పవిత్ర గోదావరీ తీరంలోని ఒక ప్రముఖ గ్రామం గంగాఖేడులో జన్మించింది. ఐదవ యేట తల్లిదండ్రులతో భూలోక వైకుంఠంగా కీర్తింపబడిన పండరీపురం వచ్చింది. చంద్రభాగా నదీ పవిత్రజలంలో స్నానం చేసి పరమ భక్తి ప్రపత్తులతో పాండురంగని దర్శనం చేసుకొని పరవశించి పోయింది. కన్నులు ఆ కరుణామయుని రూపం నుండి కదలవు, మనసు ఆ మనోజ్ఞరూపుని నుండి మళ్ళదు. మరీమరీ తనివితీరా ఆ దివ్యమంగళ విగ్రహాన్ని చూస్తూ అట్టె నిలబడిపోయింది ఆ





జనాబాయి. చూడగా చూడగా తనకీ ప్రపంచంలో అయిన వాళ్ళెవరూ లేరనీ, అన్నీ ఆయనేననీ గాఢమైన విశ్వాసం కలిగింది. కాళ్ళు ఆ ఆలయ ప్రధాన ద్వారం దాటి బయటకు రానంటున్నాయి.

ఇక ఇంటికి పోదాం రమ్మన్నారు మాతా పితలు. వీళ్ళెవ్వరు? అని వింతగా చూసింది. ఇకమీదట తనకెవరితోనూ సంబంధం లేదన్నది. తల్లీ, తండ్రీ, గురువూ, దైవమూ అన్నీ ఆ పండరీనాధుడే, ఇక ఆయనను వదలి రాలేనని ఖచ్చితంగా చెప్పివేసింది. ఆ చిన్న పిల్ల మాటలు విని అక్కడ చేరిన జనం ఆశ్చర్యపడుతుంటే తన స్వామిని తనకు దూరం చేస్తామంటున్నారేమని జనాబాయి ఆశ్చర్యచకితురాలైంది. బంధువులెంత గానో నచ్చజెప్పి తమ వెంట కొనిపోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. వాళ్ళెంత గట్టిగా ప్రయత్నిస్తుంటే అంత గాఢంగా ఆమె నిరాకరిస్తున్నది. ఆ సమయానికి పాండురంగని పరమ భక్తాగ్రేసరుడు నామదేవుడు దేవదేవుని నామస్మరణ చేసుకుంటూ ఆలయప్రవేశం చేస్తున్నాడు. ద్వారం దగ్గర జరుగుతున్న ఘర్షణను గమనించాడు. ఆ చిన్నారి బాలిక జనాబాయి భక్తి తత్పరతను గుర్తించాడు. భక్తుల హృదయాల ఆరాటం భక్తులకే గదా అర్థమయ్యేది.

ఆ చిన్నారి బాలిక తల్లిదండ్రుల్ని సమీపించి విషయమంతా విన్నాడు. జనాబాయిలో కలిగిన మార్పును, ఆమె పట్టుదలను గ్రహించాడు. ఆ భక్తురాలి భారం తానే వహిస్తాననీ వారు నిశ్చింతగా ఆమెను పండరీ పురంలో వదలి వెళ్ళవచ్చుననీ నచ్చచెప్పాడు. అనాయాచితంగా ఆమెకు మరొక మహాభక్తుని ఆశ్రయం దొరికింది. పాండురంగని సన్నిధిలో నిరంతరం నివసించే భాగ్యం అబ్బింది. ఇదంతా ఆ భక్త వత్సలుని సంకల్పం కాదా! మనకు తీవ్రమైన భక్త్యావేశం కలిగినప్పుడు తనను చేరే మార్గాలన్నీ ఆ పరంధాముడే ఏర్పాటు చేస్తాడు.

జనాబాయిని పాండురంగని సన్నిధిలో వదలలేక వదలలేక వదలి

ఆమె తల్లిదండ్రులు గంగాఖేడు చేరారు, జనాబాయి నామదేవుని ఇంట చేరి ఆ కుటుంబానికి చేతనైనా సేవ చేస్తూ నామదేవుని గురువుగా భావిస్తూ నిత్యం పండరీనాథుని నామగానం చేస్తూ ఆనందిస్తున్నది. భక్తులకు చేరువగా ఉండటం భగవానునికి చేరువ కావటమే.

ఒకనాటి రాత్రి నామదేవుని కుటుంబం అంతా గాఢ నిద్రా పరవశులై ఉన్నప్పుడు భయంకరమైన గాలి వాన వచ్చింది. పూరి పాకల కప్పలన్నీ ఎగురకొట్టుకుపోయినై. భక్త పరాధీనుడు పాండురంగడు తన భక్తుని కుటుంబానికి నిద్రాభంగం కాకుండా, వాన ఇంటిలో కురువకుండా తన చక్రాన్ని గొడుగుగాపెట్టి తానై ఇంటికప్పును సరిచేస్తున్నాడు. హఠాత్తుగా జనాబాయికి మెలకువ వచ్చింది. భగవానుని దర్శన భాగ్యం కలిగింది. ఆశువుగా కవిత్వం పొర్లుకొచ్చింది. చక్కని అభంగాలలో ఆయన గుణ గానం చేసింది.

నామదేవుడు నిద్రలేచే సమయానికి దేవదేవుడు ఒక కూలివాని వేషంలో గోడలకు మట్టి మెత్తుతూ కనిపించాడు. తనపై స్వామి చూపిస్తున్న కరుణకు కరిగి ఆ భక్తుడు భక్త పరాధీనుని పరిపరి విధాల స్తోత్రం చేశాడు.

ఇక్కడ మనకొక సందేహం కలగొచ్చు. ఆ సర్వసమర్థుడు తన భక్తున కొక గట్టి భవనం నిర్మించి ఇవ్వలేడా. ఆ పూరింటినే స్వయంగా బాగు చేయాల్సిన పనేమిటి? - అని.

భక్తి ప్రేమలకు మరోరూపం త్యాగమేనని నిరూపించటానికిన్నీ, సంపదల మూలంగా అహంకారం పొంది భగవంతునికి దూరం కాకుండా ఉండటానికిన్నీ ఆ భక్త వత్సలుడు నిత్య జీవితానికి అవసరమైనంత మట్టుకే తన భక్తులకు సమకూరుస్తూ ప్రపంచ వ్యామోహాల్లో ఇరుక్కోకుండా చూస్తూ ఉంటాడు.

ఆనాటి రాత్రి వారింటికే భోజనానికి వస్తానన్నాడు స్వామి. అక్కడ దాసిగా పనిచేస్తున్న జనాబాయి ఎంతో సంతోషంతో వండి ఆ కుటుంబం





వారందరికీ వడ్డించింది. నామదేవునీ అతని తల్లి గుణాబాయినీ, భార్యనూ, సంతానాన్నీ తన సరసన కూర్చోపెట్టుకొని విందారగిస్తున్నాడు. వడ్డిస్తున్న జనాబాయి ఒంటరిగా వంటగదిలోకి వెళ్ళి కన్నీరు కార్చింది. వారికి పట్టిన అదృష్టం తనకు కలగలేదే అని విచారించింది. ఇక్కడ ఆనందంగా భుజిస్తున్న పాండురంగడు హఠాత్తుగా విస్తరి ముందు నుంచి లేచి తనకిక ఆహారం రుచించటం లేదన్నాడు. నామదేవుడు స్వామి హృదయాన్ని కనిపెట్టాడు. జనాబాయి మీ సరసన కూచోలేనందుకు విచారిస్తుందని మీరీ పని చేస్తున్నారు. మీ ఇష్టప్రకారమే మీ ఉచ్ఛిష్టాన్నాన్ని ఆమెకే ప్రసాదంగా యిస్తామని ప్రేమతో జనాబాయిని పిలిచి స్వామి వదలిన అన్నాన్ని ఆమె చేత భుజింపజేశాడు. తన మనస్సు కనిపెట్టి తనకంతటి అదృష్టాన్ని తన దేవుడు కలగజేసినందుకు జనాబాయి పొంగిపోయింది. అందరి హృదయాలలోను చరించే ఆ సర్వాంతర్యామికి తెలియనిదేముంది?

ఆ రాత్రికి అక్కడే నిద్రిస్తానన్నాడు. ఒక రాత్రివేళ జనాబాయిని నిద్రలేపి తనకు చాలా ఆకలిగా ఉన్నది అన్నం పెట్టమని అడిగాడు. "స్వామీ యిదేమి విషమ పరీక్ష ఇప్పుడు నీకు భోజనమెక్కడి నుండి తీసుకొని రాగలను? ఇంటి వారు తినగా మిగిలిన పదార్థాన్ని రేపు నన్ను తినమని అట్టిపెట్టారు. అంతకుమించి వేరే ఆహారం యిప్పుడేమీ లేదు" అని బహువినయంతో విన్నవించింది. "అదే చాలు తెమ్మని" ఆ చద్దికూటినే తెప్పించి ఎంతో ఆప్యాయంగా భుజిస్తూ ముద్దలు కలిపి జనాబాయి నోట్లో పెట్టి తిని పించాడు. ఆమె హృదయం ఆనందంతో గంతులు వేసింది ఆనంద భాష్పాలు మున్నీరుగా కారినై. ఏమీ తన అదృష్టం! జగములనేలే ఆ తండ్రి తన అమాయకపు భక్తికి మెచ్చి తన నోట ముద్దలు పెట్టి ముద్దుగా తినిపిస్తున్నాడు. ఇంతటి భాగ్యం ఎందరికి లభించేను. ఉప్పొంగిన ఆమె హృదయంలోంచి అనర్గళ కవితాధార అశువుగా ప్రవహించింది.

**(సశేషం)**

# పరమాత్మ దివ్యనామం యొక్క మహిమ

ఆధ్యాత్మిక జీవనపు తొలి రోజులలో 'యథార్థమైన ధ్యానం' గురించి దిగులుపడవలసిన పని లేదు. జపం చక్కగా చేస్తూ, ఇష్టదైవం మీద మనస్సు లగ్నం చేసి ఉంచండి. కాలం గడుస్తున్న కొద్దీ జపం ధ్యానంగా రూపాంతరం చెందుతుంది. అంటే కొంతకాలానికి, ఒక గిన్నెలో ఉన్న నూనెను మరొక గిన్నెలో పోస్తున్నప్పుడు, ఆ నూనె ధార తెంపు లేకుండా ఎలా క్రిందికి పడుతుందో, అదే విధంగా మీ ఆలోచనలు ఒక అవిచ్ఛిన్న తైలధారలా, భగవంతుణ్ణే కేంద్రంగా చేసుకుని ముందుకు సాగుతాయి.

క్రమేణా జపసాధన వలన ఈ ప్రపంచం కంటే పరమాత్మే ఎక్కువ యథార్థమైనవాడుగా కనిపిస్తాడు! అప్పుడే నిజమైన ధ్యానం సాధ్యపడుతుంది. మొదట చేయవలసిన పనులను సక్రమంగా చేస్తే, తరువాత ఫలితాలు వాటంతట అవే వస్తాయి.

జపసాధనను మీకు చేతనైన విధంగా మొదలుపెట్టండి. పైకి వినపడేటట్లు లయబద్ధంగా ఓంకారాన్ని జపించండి. క్రమక్రమంగా, జపాన్ని మరింత మౌనం చేసి, ఓంకారం వెనుక ఉన్న శబ్దబ్రహ్మతో అనుసంధానానికి యత్నించండి. సామరస్యంతో కూడిన ఈ శబ్దాన్ని జపిస్తూ, ఈ శబ్దం అనంతమైన పరమాత్మను సూచించే ఒక చిహ్నం అని గుర్తెరగండి. ఆ పరమాత్మలో ఉన్న ఎల్లలు లేని ఆనందాన్ని, ప్రేమను తలుచుకోండి. ఒక రేడియోను సక్రమంగా 'ట్యూన్' చేయడం వలన సంగీతాన్ని లేదా వివిధ రకాల కార్యక్రమాలను వినగలుగుతాము. అలాగే విశ్వంలో అనాది నుంచీ ఉన్న విశ్వకంపనాలతో మనల్ని అనుసంధానం చేసుకోవడం వలన విశ్వమనస్సుతో (హిరణ్యగర్భ) మనకు సంసర్గం ఏర్పడుతుంది. ఈ సంసర్గం ద్వారా సర్వాంతర్యామి, మనలోని ఆత్మలకు ఆత్మ, సర్వేశ్వరుడు అయిన పరమాత్మతో సంస్పర్శ ఏర్పడుతుంది.





సర్వవిధాలుగా ప్రయత్నిస్తూ జపసాధనను కొనసాగించండి. సాధకుడు తన గురువు నుంచి పొందిన మంత్రానికి ఎంతో శక్తి ఉంటుంది. ఆధ్యాత్మిక పథంలో ఎదురయ్యే అన్ని అడ్డంకులనూ తొలగించి, అతనిలోని పారమార్థిక చైతన్యాన్ని జాగృతం చేస్తుంది. మనం కాళీ, దేవి లేదా వివిధ నామాలతో వ్యవహరించే దివ్యజనని యొక్క శక్తి ఆ మంత్రంలో ఉంటుంది. ఆ దివ్యజనని ఈ ఆధునిక యుగంలో శ్రీరామకృష్ణులుగా అవతరించింది.

ఒక్కొక్కసారి సాధకుడు తన జపమాలతో లేదా చేతితో తనలోని ఉన్నతమైన చైతన్యకేంద్రాలను స్పృశించడం వలన ఎంతో మేలు జరుగుతుంది. భౌతికమైన స్పర్శ ద్వారా ఆయా విశేషకేంద్రాల మీద ఏకాగ్రం చేయడం సులభం అవుతుంది. పవిత్రమైన శబ్దం లేదా మంత్రం మన మనస్సుకు ఒక విధమైన ఊతాన్ని ఇస్తుంది. ఏవైనా విపత్కరమైన పరిస్థితులు ఎదురైనప్పుడు, శాంతంగా ఉంటూ, మనల్ని మనం పరిశీలించుకుంటూ ముందుకు సాగాలి. మన హృదయాంతరాళాల నుంచి ఆ దివ్యజననిని ప్రార్థించాలి. ఏ విపత్తు అయినా మన సమతుల్యతను ఎందుకు పాడుచేయాలి? గొలుసును వదిలేశావంటే నిన్ను నువ్వు కోల్పోయినట్టే. భౌతిక సహాయాలు అందని పరిస్థితులలో దైవసహాయం మాత్రమే శరణ్యం. అంటే మనందరి ఆత్మలకు ఆత్మ అయిన పరమాత్మే మనకు సహాయపడతాడు. జపం వలన మాత్రమే ఈ దైవసహాయానికి మనం చేరువ కాగలము.

మనం సాధారణంగా ఆధ్యాతిక సాధన రూపంలో చేసేది జపం మాత్రమే. దీనినే మనం 'ధ్యానం' అని నామకరణం చేస్తాము! నైతిక జీవనం, కర్తవ్యనిష్ఠ, జపం, ప్రార్థన, సద్గ్రంథ పఠనం, ఆ పఠించిన భావాలపై చింతన వంటి సాధనలను పునాదిగా చేసుకోకుండా, ధ్యానం చేయడం అసంభవం అని మనం గుర్తెరగాలి. ఈ సాధనలే మన మనస్సును

ఇంద్రియార్థాల ఆకర్షణల నుంచి, లెక్కకు మిక్కిలి ప్రలోభాల నుంచి మరల్చి, పవిత్రమైన ఆలోచనలవైపు మళ్ళిస్తాయి. ఇన్నిరకాల సాధనలు చేస్తున్నా, పారమార్థిక జీవనపు ప్రారంభదశలో ఈ పవిత్రమైన ఆలోచనల పరంపర అవిచ్ఛిన్నంగా ఉండకపోవచ్చు. వదలకుండా చేసే ప్రయత్నం వలన మన ఆలోచనా పరంపర పవిత్రంగా మారుతుంది.

మనోవాక్కాయ కర్మలలో మనం మరింత పవిత్రులం అవుతున్న కొద్దీ, మన ఏకాగ్రత పెరుగుతుంది. ధ్యానం మెరుగవుతుంది. సాకార, నిరాకార రూపాలలో భగవంతుణ్ణి సాక్షాత్కరించుకోగలుగుతాము. నిత్య-అనిత్యాల మధ్య జీవాత్మ పరమాత్మల మధ్య ఉన్న సంబంధం మనకు అవగతం అవుతుంది. మన ధ్యానం సర్వోత్కృష్ట స్థితిని చేరుకుంటుంది. మనలోని జీవాత్మ తన గమ్యమైన పరమాత్మను సాక్షాత్కరించుకుని ముక్తి, ప్రశాంతి, స్వేచ్ఛలను పొందుతుంది.

ఆ పరమాత్మ దివ్య నామం మనందరికీ శాంతి సౌఖ్యాలను ఒసగు గాక!



# సన్న్యాసం సమున్నతం

భారతీయ ధార్మికతతో, ఇతిహాస పాత్రల చిత్రణలో ఆదర్శప్రాయమైన ఘట్టాలున్నాయి. పరమ కిరాతకులు కూడా పారమార్థిక ప్రస్థానంలో తరించిన ఉదంతాలున్నాయి. సమాజం చిన్నచూపు చూసే వృత్తిలో ఉన్నా, ఆచరించే తీరులో మాత్రం ఎలాంటి హీనభావంకానీ, కాపట్యం కానీ చూపలేదు. ఉదాహరణకు రత్నాకరుడు దారిదోపిడీలు చేసే దాష్టికుడు. అయినా నారదుడి ఒకే ఒక్క ఉపదేశంతో మధురమైన కావ్య కర్తగా, వాల్మీకి కవిగా పరివర్తన చెందాడు; పరమపావనమైన రామాయణాన్ని రచించాడు. మాంసాన్ని విక్రయించే వృత్తిని ఎంచుకున్న ధర్మ





వ్యాధుడనే ఓ సామాన్య వ్యక్తి కేవలం ధార్మికమైన తన పనితీరుతో, తల్లిదండ్రుల సేవతో బ్రహ్మజ్ఞానిగా మారిపోయాడు. సాక్షాత్తూ కౌశికుడి లాంటి మహర్షికే ఆదర్శమయ్యాడు. ఇలా ఈ పావన భారతావనిలో వృత్తి ఏదైనా ధార్మికతే అంతస్సూత్రం.

కానీ, మరోవైపు దురదృష్టవశాత్తూ సర్వోత్కృష్టమైన ఆధ్యాత్మికత అన్వేషణలో కపట వేషధారులు పుట్టుకొస్తున్నారు. ఇలా ఏ కొందరి నిర్వాకం వల్లనో పూర్తిగా సన్న్యాస ఆశ్రమానికే అపకీర్తి దాపురిస్తోంది. ఆధ్యాత్మిక పేరుతో, ధార్మిక జీవనం పేరుతో ఎన్నో వేషాలు వేసుకొని లోకాన్ని మోసగించే నాటకాల రాయుళ్ళు సమాజాన్ని తప్పు దోవ పట్టిస్తూ ఉంటారు. అసలు తత్త్వాన్ని మరచి తమ స్వలాభం కోసం మూలాన్నే మార్చేసి ప్రబోధించేవారు అన్ని మతాల్లోనూ ఉన్నారు. పొట్టకూటి కోసం భక్తులను పలువిధాల ప్రలోభపెట్టి, పక్కదారి పట్టించే స్వార్థపరులను శ్రీ ఆదిశంకరాచార్యుల ప్రముఖ శిష్యులు తోటకాచార్యులు 'భజ గోవిందం'లో ఆనాడే ఎండగట్టారు.

జడలు కట్టిన తలవెంట్రుకలతో ఒకడు, నున్నగా గుండు గీసుకున్నవాడు మరొకడు, కాషాయ వస్త్రాలు కట్టినవాడు ఇంకొకడు-ఇవన్నీ కేవలం లోకం కోసం చేసే వాళ్ళు కళ్ళుండీ చూడని మూర్ఖులు. ఇవన్నీ పొట్ట కూటి కోసం వేసే పరిపరి విధాలైన వేషాలంటూ .....

**జటిలో ముణ్డీ లుంచిత కేశః కాషాయాంబర బహుకృత వేషః।**

**పశ్యన్నపి చ న పశ్యతి మూఢః ఉదర నిమిత్తం బహుకృత వేషః॥**

అని చురకలు వేశారు. అతి పవిత్రమైన ఆధ్యాత్మిక తులసివనంలో, గంజాయి మొక్కల్లా పుట్టుకొస్తున్న వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలి.

**భక్తి పేరుతో బూటకం :** సామాన్యుల బలహీనతల్ని ఆసరాగా చేసుకొని వారి జీవితాలతో ఆటలాడుకునే కపట ధార్మికులు నేటి సమాజంలో పెరిగిపోయారు. భక్తులు కూడా భక్తికీ, భగవంతుణ్ణి చేరుకోవడానికీ

ఎలాంటి శ్రమ, సాధన అవసరం లేని అడ్డదారుల కోసం వెంపర్లాడుతున్నారు. ఆధ్యాత్మిక పయనంలో మధ్యవర్తులను వెతుక్కుంటున్నారు. మోసాల మాయలో చిక్కుపడిపోతున్నారు. ఎందరో నకిలీ స్వామీజీలు పుట్టుకురావడానికి అవకాశం కల్పిస్తున్నారు. అందుకే భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస 'భగవన్మార్గంలో బూటకం ఎన్నటికీ మంచిది కాదు. బూటకపు వేషధారణ సరికాదు. మనస్సు వేషానికి తగ్గట్లు లేనట్లయితే, అది క్రమేణా పతనం చెందుతుంది. అదే విధంగా విషయానురక్తి కలిగి ఉన్నవాడు సన్న్యాసం స్వీకరించినా ఒరిగేది ఏమీ లేదు. సన్న్యాసి విషయానురక్తుడవడం ఉమ్మి వేసి మరలా ఆ ఉమ్మినే మింగడం లాంటిది' అన్నారు.

నలుగురు చూస్తున్నారని బాహ్యంగా ధార్మికవేత్తల్లా వేషాలు ధరిస్తూ, అంతరంగంలో మాత్రం అనైతికమైన ఆలోచనల్ని నింపుకొనేవారు నశించిపోతారు. అందుకే భక్తి పేరుతో బహు వేషాలు వేసే వారిని మూర్ఖులుగా నిర్వచిస్తున్నారు. ఈ 'భజగోవిందం'లో తోటకాచార్యులు. నిజానికి ఆధ్యాత్మికతలో, సన్న్యాస ఆశ్రమంలో ఎలాంటి రహస్యాలూ ఉండవు. అవన్నీ స్వచ్ఛమైన స్ఫటికంలా పారదర్శకమైనవి. ఏ మత నియమమైనా, మనసా, వాచా, కర్మణా ఒకేలా ధర్మబద్ధంగా ఉండటం!

**సన్న్యాస ఆశ్రమం సమున్నత ఆదర్శం :** గృహస్థులనూ, భక్తులనూ సన్మార్గంలో నడిపి, వారి జీవన నావకు చుక్కానిగా నిలిచే వ్యక్తే నిజమైన 'సన్న్యాసి'. సర్వసంగ పరిత్యాగిగా సంపూర్ణంగా భగవంతునిపై ఆధారపడి జీవించే అలాంటి మహానుభావుడి సన్నిధిలో పారలౌకిక ప్రపంచాన్ని పరిచయం చేసుకోవాలని జిజ్ఞాసువులు తపిస్తూ ఉంటారు. కానీ ఇంతటి మహోన్నతమైన సన్న్యాస ఆశ్రమాన్ని స్వీకరించి కూడా, మళ్ళీ కామినీ కాంచనాల వైపో, పేరు ప్రఖ్యాతుల వైపో మనస్సు మరలి రాగద్వేషాలకు లోనైతే సమాజం హర్షించదు. అందుకే భగవద్గీతలో (5, 3) శ్రీకృష్ణ భగవానుడు





ఇలా స్పష్టం చేశాడు :

**జ్ఞేయః స నిత్యసన్న్యాసీ యో న ద్వేష్టి న కాంక్షతి।**

**నిర్ద్వంద్వో హి మహాబాహొ సుఖం బంధాత్ ప్రముచ్యతే ॥**

'ఎవరు రాగద్వేషాలకు వశుడు కాడో అతడు సదా సన్న్యాసి అని తెలుసుకోమనీ, ద్వంద్వాతీతుడైనవాడు సులభంగా కర్మబంధాల నుంచి విముక్తుడవుతాడు'. అయితే ఆధునిక ప్రపంచంలో స్వామీజీలుగా, వేదాంతవేత్తలుగా ప్రచారంలో ఉన్న కొంతమంది వ్యక్తులు ఈ మౌలిక సూత్రాన్ని మరచిపోతున్నారు. వివేక వైరాగ్యాలకు బదులు విషయలౌల్యంలో పడి తమ ప్రాథమిక ఆదర్శాన్నీ, కర్తవ్యాన్నీ విస్మరిస్తున్నారు. వర్తమాన వ్యవహారాల పరంగా గృహస్థులతో కొంత కలివిడిగా ఉంటూ, వారి సంశయాలను తీరుస్తూ, వారి ఆధ్యాత్మిక పురోగతికి సాయపడటంలో తప్పు లేదు. కానీ, అది మొదటికే మోసం తెచ్చి, తమ సన్న్యాస ఆశ్రమ ధర్మానికి కూడా విఘాతం కలిగించే స్థాయిలో పరిధి దాటకుండా జాగ్రత్తపడాలి.

**ఆధ్యాత్మికత ... ఆడంబరాలు :** స్వామీజీలనూ, ఆధ్యాత్మిక గురువులనూ భగవంతుడికి ప్రతినిధులుగా పూజించుకోవడం భారతీయ సనాతన సంప్రదాయం. అయితే పూజలందుకునే ఆ స్థాయికి తాము అర్హులమా? కాదా? అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలి. ఆ స్థానానికి సముచితమైన రీతిలో తమ జీవితాన్ని మలుచుకోవాలి. భౌతికమైన ఆడంబరాలకూ, ఆర్భాటాలకూ దూరంగా ఉంటూ గృహస్థులకు దారిదీపాల్లా నిలవగలగాలి. కానీ, నేడు కొంతమంది స్వామీజీలు ప్రాపంచికులు కూడా అచ్చెరువొందే సౌకర్యాలను అనుభవిస్తున్నారు. అందుకే 'శ్రీకాళహస్తీశ్వర శతకం'లో ధూర్జటి ఇలా తెలియజేశారు :

**అయవారై చరియింపవచ్చు, తమ పాదాంభోజ తీర్థంబులన్**

**దయతో గొమ్మనవచ్చు, సేవకుని అర్థప్రాణ దేహాదుల**

**న్నియు మా సొమ్మనవచ్చు గాని, సిరుల న్నిందింప, నిన్నాత్మని**

**ప్రియతన్ కానగరాదు, పండితులకున్ శ్రీ కాళహస్తీశ్వరా!**

'ఓ పరమశివా! కొందరు గురువులమని చెప్పకుంటూ తిరగవచ్చు. పాదపూజలు చేయించుకొని తనను సేవించుకొమ్మని, శిష్యులకు తమ కాళ్ళు కడిగిన నీటిని తీర్థంగా ఇవ్వవచ్చు. ఇలా గురువులనుకునే ఆ పండితులు కూడా సంపదలను ఆశించకుండా తిరస్కరించడం లేదు; కర్మలను విడిచినవారై తమ మనస్సులందు నిన్ను దర్శించుకునే ప్రయత్నం చేయడం లేదు'.

రామకృష్ణ సంఘానికి సర్వాధ్యక్షులుగా వ్యవహరించిన స్వామి రంగనాథానంద ప్రపంచ దేశాలన్నీ పర్యటించి ప్రసంగాలతో ప్రఖ్యాతి గాంచినా, వారు ఏ ఒక్కరోజూ విలాసవంతమైన జీవితాన్ని గడపలేదు. పరిమితమైన సాధారణ వస్తువులతోనే జీవించేవారు. మనం ఆచరించేదే ఇతరులకు బోధించాలన్న భావంతో భగవాన్ శ్రీ రామకృష్ణ పరమహంస చెప్పిన 'అపనీ ఆచరీ ధర్మ జీవేరే సిఖావ్' అన్న మాటను గుర్తు చేసుకునే వారు. నిరాడంబరంగా జీవించమని భక్తులకు చెబుతూ, మనం ఆర్భాటంగా జీవిస్తే అర్థం లేదని వివరించేవారు.

**పారమార్థిక తృష్ణ పలాయనవాదం కాదు! :** లౌకిక ప్రపంచంలో బతకలేని వారు ఆధ్యాత్మికత వైపు మొగ్గు చూపుతారని చాలామంది పొరపాటు పడతారు. కానీ, పారమార్థికత అనేది పలాయన వాదం కాదు. సర్వోన్నత మైన త్యాగానికి ప్రతీకగా కాషాయాన్ని ధరించి, పారమార్థికతను అన్వేషించే ధన్యాత్మక సాధుపుంగవులు ఎందరో ఉన్నారు. అలాంటి వారికి తలవంపులు తెచ్చేలా కొందరు ఆ ఆహార్యాన్ని ధరించి అపరాధాలు చేస్తే పాపాన్ని మూటగట్టుకున్న వారవుతారు. శ్రీ శంకర భగవత్పాదుల శిష్యవరేణ్యులు చెప్పినట్లు కళ్ళుండీ చూడలేని మూర్ఖులుగా ముద్రపడి పోతారు. ఇలాంటి వారిని ఉద్దేశిస్తూ యోగి వేమన కూడా ఇలా అంటారు:

**అంతరంగమందు అపరాధములు చేసి**





**మంచివాని వలెనె మనుజుడుండు**

**ఇతరు లెరుగకున్న నీశ్వరుడెరుగడా?**

**విశ్వదాభిరామ వినుర వేమ!**

నిజమే! మనిషి తన మనస్సులో ఎన్నో దురాలోచనల్ని నింపుకొని, పైకి మాత్రం మంచివాడిగా కనిపిస్తే ఫలితం ఉండదు. అలా నటనతో తోటి మనుష్యుల్ని మోసగించవచ్చు. కానీ సర్వాంతర్యామి అయిన భగవంతుడికి మాత్రం ఇవన్నీ తెలియకుండా ఉంటాయా?

## మాతృసంస్థ కబుర్లు

డిసెంబర్ 9వ తేదీ ఆదివారం ఉదయం 10 గం.లకు శ్రీ సాయి సేవా సమితి ట్రస్టు వారి సర్వ సభ్య సమావేశం జరిగింది.

అనంతరం సాయిధామం ప్రాంగణంలో శ్రీ సాయి విద్యాధామం ఉచిత ఉన్నత పాఠశాలకు నూతనంగా నిర్మించిన ద్వాదశ శౌచాలయాల ప్రారంభోత్సవం సహాయ సహకారాలు అందించిన దాతలతో చేయించడం జరిగింది. వారందరినీ ఉద్దేశించి శ్రీ సాయిరామ చైతన్యగారు మాట్లాడుతూ ఆశ్రమంలో జరుగుతున్న సేవా కార్యక్రమాల గురించీ, పూజ్య గురుదేవుల ఆశయాలను, ఆకాంక్షలను సవివరంగా వివరించారు. ఆశ్రమ ట్రస్టు సభ్యులను వారికి పరిచయం చేసారు. దాతలకు పూజ్య గురుదేవుల ఆశీస్సులతో శాలువా, సాయినాథుల వారి చిత్రపటంతో ఆశ్రమ మూలస్థంబాలలో ఒకరైన శ్రీ ఆనందంగారు సత్కరించారు. వారందరికీ ఆశ్రమం తరపున ప్రసాదం అందించడం జరిగింది.

మధ్యాహ్నం 2 గం.లకు 12 గ్రామాల నుంచి విచ్చేసిన గ్రామస్థుల సమావేశం జరిగింది. డిసెంబర్ 22వ తేదీ దత్త జయంతి సందర్భంగా

జరుగబోయే శ్రీ దత్త మహాయజ్ఞం గురించి గ్రామస్తులకు తెలియ జేయడం కోసం సమావేశం నిర్వహించారు. జ్యోతిర్మయి పీఠ వ్యవస్థాపకు లైన శ్రీశ్రీశ్రీ గౌరీభట్ల దివ్యజ్ఞాన సిద్ధాంతిగారు యజ్ఞంలో పాల్గొనవలసిన విధానమును, యజ్ఞం యొక్క విశిష్టతను, సాయిధామం చేస్తున్న కృషిని గ్రామస్తులందరికీ సవివరంగా తమదైన శైలిలో వివరించారు. అనంతరం సాయిరామ చైతన్యగారు మాట్లాడుతూ ఆశ్రమం యొక్క లక్ష్యాన్ని, గురువు గారి యొక్క శక్తిని, గురువు పట్ల ఉండవలసిన గురుభక్తిని, శ్రీ దత్త మహా యజ్ఞం తలపెట్టిన కారణ వివరాలనీ, దాని ద్వారా వచ్చే ఫలాన్నీ ప్రజలందరికీ అందించాలనీ మీరందరూ ఆశ్రమ కార్యకర్తలుగా, గురువు గారి అనుచరులుగా, దేశభక్తి, దైవభక్తి పరాయణులుగా ఉండాలని కోరుకుంటూ గురువు గారి యొక్క బ్యాడ్జీలను అందరికీ అందించారు. చివరగా శ్రీదత్త నామ సంకీర్తనతో ముగిసిన పిమ్మట అందరికీ గురు ప్రసాదాన్ని అందించారు. వచ్చిన వారందరూ పరమ సంతోషంతో గురు సేవా మార్గం దొరికిందనీ, ఇలాంటి అవకాశాలు కల్పించాలనీ గురుదేవుల చరణ కమలాల ముందు ప్రణమిల్లుతూ ప్రార్థించారు.

శ్రీ దత్త మహా యజ్ఞానికి ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. శ్రీ సాయిరామ చైతన్యగారిలో ఆందోళన, యజ్ఞానికి కావలసిన ఏర్పాట్లు, వస్తువులు, అలంకరణ అన్నీ సమయానికి చెయ్యగలమా అని పగలు, రాత్రి అదే ఆలోచనలో ఉన్నారు. నూట ఎనిమిది కుండాల నిర్మాణం, యజ్ఞ కుండాలు అలకడం, ముగ్గులు పెట్టడం ఈ పనీ ఆ పనీ అని తేడా లేకుండా సాయి విద్యాధామం విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు, కార్యకర్తలుగా మారి చక్కని ఏర్పాట్లు చేస్తున్నారు. సమయం దగ్గర పడుతున్నది. టెంటువాడు, పందిరి వెయ్యడానికీ చాలా విసిగించి అవుతుందా లేదా అన్న సందిగ్ధంలో వేసాడు. యాగశాల నిర్మాణం, అలంకరణ, జెండాలు కట్టడం, ముగ్గు పోయించడం, యజ్ఞ సామాగ్రి సిద్ధం చేసుకోవడం, భోజనాల ఏర్పాట్లు మొదలైనవి పూర్తి కావస్తున్నాయి





అనేలోపే 21వ తేదీ రానే వచ్చింది. 21వ తేదీ రాత్రి అక్కలు, అత్తయ్యలు, అన్నయ్యలు, ఆశ్రమ బంధవులు విచ్చేసారు. రాత్రంతా యజ్ఞానికి కావలసిన సామాన్ల కిట్లను సిద్ధం చేయడం, పూల అలంకరణ, లైటింగ్, యాగ్నికులకు స్టేజి ఏర్పాట్లతో తెల్లవారి 22వ తేదీ వచ్చేసింది.

డిసెంబర్ 22వ తేదీ ఉదయం గం.6.00లకే హడావిడి మొదల య్యింది. శ్రీశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారి శిష్యబృందం ఆధ్వర్యంలో శ్రీ సాయి రామ చైతన్యగారి కరకమలములతో దత్తాత్రేయ స్వామి వారికి నమక, చమక, రుద్రంతో పంచామృతాభిషేకం, అష్టోత్తర శతనామ పూజ జరుగగా దత్త స్వామి శక్తిని భక్తులకు శ్రీ సాయిరామ చైతన్యగారు వివరించారు.

అనంతరం గం.10.00లకు యాగశాల ప్రవేశం, దత్తస్వామి అనుగ్రహం వలన భక్తులు ఎక్కువ సంఖ్యలో విచ్చేసారు. యాగశాల ప్రాంత మంతా వేదమంత్రాలతో, పుణ్యాత్ములతో పునీతమయ్యింది. శ్రీశ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారి ఆధ్వర్యంలో విఘ్నేశ్వర పూజ, స్వస్తి వాచనము, అఖండ దీపస్థాపనము, శ్రీశ్రీ గురుపూజ, గోపూజ జరిగాయి. అనంతరం దీక్షాధారణ శాస్త్రోక్తంగా జరిగింది.

భారతీయులకు పరమ పవిత్రమైనవి వేదాలు, అయితే వీటిలో ఏ విషయాలు ఉంటాయో చదవాలంటే సామాన్యులకు అర్థం కాదు. అందుకే శ్రీ వాచస్పతి, విద్యాభూషణ సిద్ధాంతి బిరుదాంకితులైన శ్రీ మర్రి కృష్ణారెడ్డి గారు వేదాలను 25 సం.లు కష్టపడి తెలుగులోనికి అందరికీ అర్థమయ్యే విధంగా అనువదించారు. దీనివెనకాల కఠోరశ్రమ, అంకితభావం, సేవా తత్పరత ఉన్నాయి. ఇంతటి పండితులు మన దేశంలో మన మధ్య ఉండటం మన అదృష్టం. వారు అనువదించిన గ్రంథం "దివ్య వేదవాణి"గా నామకరణం చేసారు. దీన్ని డిసెంబర్ 22వ తేది వారి జన్మదినం కూడా కావడం విశేషం. శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతిగారి చేతుల మీదుగా ఆవిష్కరిం చారు. కృష్ణారెడ్డిగారిని ఆశ్రమ నిర్వాహకులైన శ్రీ సాయిరామ చైతన్యగారు ఘనంగా సన్మానించి 'దివ్య వేదవాణి'ని స్వీకరించారు. శ్రీ మర్రి కృష్ణారెడ్డి

గారు వేదాల గొప్పతనాన్ని భక్తులకు వివరించారు.

అమ్మా నాన్నల స్థానాన్ని భర్తీ చేసేవాడు 'అన్నయ్య' ఆశ్రమంలో మాతాజీ, గురుదేవుల లేని లోటుని తీరుస్తూ, అమ్మగా, నాన్నగా, అన్నగా, గురువుగా అన్ని బాధ్యతలను నిర్వహిస్తున్న "అన్నయ్య" శ్రీ సాయిరామ చైతన్యగారు. గురుదేవుల మార్గంలో నడుస్తూ వారి ఆశయాల్ని ఆదర్శంగా తీసుకొని ఆశ్రమాన్ని ఓ ఉన్నతస్థితిలో ఉంచాలనీ సాధన చేస్తున్న వారినీ 'అన్న' అన్నయ్య అని పిలవడం సరైన పద్ధతి కాదు. వారిని ఈ రోజు నుంచి మనందరం "రామయోగి"గా పిలుచుకుందామని శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు శ్రీ సాయిరామ చైతన్యగారిని శాలువా, పూలమాలలతో సత్కరించి ఆశీర్వచనాలు అందించారు.

అనంతరం శ్రీ సాయిరామ చైతన్యగారు మాట్లాడుతూ నేను ఈరోజు మీ అందరి ముందు స్టేజిపైన ఇలా నిలబడి మాట్లాడగలుగుతున్నానంటే అది నా తల్లి అయిన పూజ్య మాతాజీ, పూజ్య గురుదేవుల అనుగ్రహమే. ఈ ఆశ్రమానికి సేవ చేసే భాగ్యాన్ని కలిగించిన నాకన్న తల్లిదండ్రులను చూసి నేను గర్వపడుతున్నాను. ప్రతి పురుషుడి విజయం వెనుక ఒక స్త్రీ ఉంటుందంటారు కదా! అలా నా వెన్ను కాపై నిలిచి నన్ను ఇంతటి వాడిని చేసింది అమ్మ మాతాజీ. అనుభవంలో చిన్నవాడిని. ఇప్పుడిప్పుడే అర్థం చేసుకుంటున్నాను. మాతాజీ తర్వాత ఆ లోటును పూజ్య మాతాజీ నిర్మల యోగభారతిగారు నాలో ధైర్యాన్ని నింపారు. నీలో గురువుగారి శక్తి ఉంది. నువ్వు అనుకున్నవి సాధించగలవు. నీకు ఏ ఇబ్బంది వచ్చినా ఈ అమ్మ ఉందని మరువకు అని వారి మాతృత్వాన్ని చాటుకున్నారు.

ఒకప్పుడు ఈ ప్రాంతం అంతా రాళ్లు రప్పలతో నిండి ఉండేది. ఇప్పుడు ఇంత సుందరంగా ఉందంటే దీని వెనుక పూజ్య గురుదేవుల శక్తి చాలా అమోఘమైనది. ఆ చంద్రార్కం నిలవాలంటే నిత్యం పూజలు, వేద మంత్రాలు, యజ్ఞయాగాలు జరగాలి. ప్రజలందరూ సుఖశాంతులతో వర్థిల్లాలి. అందునా దత్త జయంతి చాలా పవిత్రమైన రోజు. ఉత్త హోమం





వలన సకల సంపదలు కలుగుతాయనీ, శత్రు బాధలు, నరఘోషలు ఉండవనీ, శని దోషం తొలుగుతాయనీ మన జీవితాలు నిత్య కళ్యాణం, పచ్చ తోరణంగా వెలుగొందుతుందనీ చేసే యజ్ఞాన్ని భక్తి శ్రద్ధలతో చేసి దత్త స్వామి కృపకు పాత్రులు కాగలరనీ శ్రీ సాయిరామ చైతన్యగారు ప్రసంగాన్ని ముగించారు.

అనంతరం యాగశాలలో అగ్నిప్రతిష్ఠా కార్యక్రమం ప్రారంభమైంది. మొదటగా గణపతి హోమము, ప్రతి మంత్రానికి శాస్త్ర వివరణ చెప్తూ ఎంతో చక్కగా నిర్వహించారు సిద్ధాంతిగారి శిష్య బృందం. పాఠశాల విద్యార్థులు భక్తులకు కావలసినవి అందిస్తూ, వచ్చిన వారందరినీ ఆదరంగా పలకరిస్తూ, వారు చేస్తున్న పనులను చూసి సాయి విద్యాధామం పాఠశాల పిల్లలు ఎంత చక్కగా క్రమశిక్షణగా ఉన్నారని భక్తులందరూ పొగుడుతుంటే ఈ మాటలు మాతాజీగారు వింటే ఎంత బాగుండేదో అనిపించింది.

నవగ్రహ హోమం, దత్తాత్రేయుల వారి మూలమంత్ర గాయత్రీ హోమము, దిక్పాలక బలి, యాజ్ఞికుల స్వాహాకారాలతో భక్తులంతా తన్మయత్వం చెందారు. పొగ వల్ల కొంచెం ఇబ్బంది కలిగినా సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనతో అందరూ ఇంకా ఉత్సాహాన్ని పొందారు.

అనంతరం శ్రీశ్రీశ్రీ మాతా నిర్మలయోగ భారతిగారు అనుగ్రహ భాషణం, యజ్ఞం అసలు ఎందుకు చేసుకోవాలి? దాని విశిష్టత ఏమిటి? అనే విషయాలను వివరించారు. అర్చనలు, పూజలు చేయించుకొని నూతన సంవత్సరంలో అంతా శుభమే జరగాలనీ, ప్రపంచం సుఖశాంతులతో ఉండాలనీ భగవంతుడిని భక్తులు మనసారా వేడుకున్నారు. ఆశ్రమం పిల్లలు, పెద్దలు అంతా గుడిలో ప్రసాదాలు పెట్టడం వంటి కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# స్వరాంజలి

- మండవ రంగారావు

(గత సంచిక తరువాయి)

సాయివాణి యామె సాయిధామము గూడ
తానె యగుచు పనుల తాండవించె
పదియు నాఱు పనులు పగలు రాత్రి యనక
నిర్వహించెనామె నిగ్గు దేల ॥

సాయి సాయి యనుచు సాధన జేయుచు
సాయిధామ మందు చంటి వాళ్ళ
కమ్మలేని లోటు అమ్మయే తానయి పెంచి పెద్దజేసె పేరు గాంచ॥

చదువు నేర్పె చాల సంస్కారమున్నామె
నడక నేర్పె నామె నడత యున్న విద్యతోడి నామె విజ్ఞానమున్నేర్పె
బడిని బాగ నడిపి భవిత గలుగ ॥

సంస్కృతాంధ్రములను చక్కగా పఠియించి
భారతీయ చరిత బాగా నేర్చి తీర్చి దిద్దె మనల తీరుతెన్నుల తోడి
తల్లి ఋణము దీర్చ తరుణ మయ్యె

ఆశ్రమంబునందు ఆశ్రయించిన వారి
ఒడలు దాచు కొనక ఓపినంత
సేవ చేయుదాము చేయగలిగినంత
ఇహము పరము మనకు ఇదియే బ్రతుకు

గురుని మాట ఇదియు! గుండె నిండుగ దయ
కలుగువాడె మనిషి। కలిమి లేములెల్ల కాదు నిజము।
లెమ్ము లెమ్ము భరత ఆదుకొనగ నీవు ఆర్తజనుల ॥





# ప్రశాంతి

ఇది ఒక యతీశ్వరుడు నడయాడిన చోటు. పాతికేళ్లుగా నిరంతర సత్సంగాలు నడుస్తున్న తావు-శ్రీ సాయినాథుల వారికన్నా ముందరే వారెక్కడ ప్రతిష్ఠింపబడాలో తామే లిఖితపూర్వకంగా చూపిన ఆలయం- పూలతోటలాంటి చక్కని పాఠశాల, ఆనందోత్సాహాలతో తిరిగే శిశుమందిరం వంటివి ఉన్న 33 ఎకరాల వైశాల్యం ఉన్న ప్రదేశం. అలాంటి యీ -

సాయిధామంలోని వానప్రస్థాశ్రమం ప్రశాంతి. ఆధ్యాత్మిక చింతన, కొంతయినా సేవాదృక్పథం ఉన్న - 55 సం॥ పైబడిన 75 సం॥ దాటని వృద్ధులెవ్వరికైనా యిది సాదరంగా స్వాగతం పలుకుతుంది.

## ఆశ్రమం కల్పించేవి

- ❖ చక్కని ప్రశాంత ప్రకృతి సహజ వాతావరణం.
- ❖ సాత్త్వికమైన అల్పాహార, భోజనాలు.
- ❖ నిత్య సత్సంగం.
- ❖ కులభేదాలు లేని సమభావం.
- ❖ సాయిబాబా, దత్త దేవాలయాలు, భారతమాతల నిత్య సందర్శనభాగ్యం.
- ❖ మంచి గ్రంథాలయం.
- ❖ హెూమియో వైద్యం

## ఆశ్రమంలో చేరదలచుకొన్నవారి బాధ్యతలు

- ❖ ఆశ్రమ ప్రశాంతతకు అనుగుణంగా ఉండటం.
- ❖ సేవా కార్యక్రమాలకు చేతనైనంతగా సహకరించడం
- ❖ వారి వసతికీ, భోజనాదికాలకూ చెల్లించవలసిన రుసుమును సక్రమంగా చెల్లించటం.

**ప్రశాంతిలో చేరదలచిన వారు దిగువ ఇచ్చిన ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.**

**పరమపూజ్య శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీ వారి**
**దివ్యాశీస్సులతో,**
**ధర్మాధికారి**
**ఫోన్స్ : 9440413455, 9492315605**